


## చిన్నమాట

కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం  పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.

కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణి చేసే ప్రయత్నం  కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచీ స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.

తెలుగులో 1950-1960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.

విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్థమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.

చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్డ్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.

అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...

మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.

# మంచికొడుకు
## { విలియం బెంకియర్  కథకి స్వేచ్ఛానువాదం}

**కారు తలుపులు మూసుకునే** శబ్దం విన్న తొమ్మిదేళ్ళ కీత్ మంచం దిగి కిటికీలోంచి బయటికి చూసాడు. ఓ పోలీస్ ఆఫీసర్ తన తండ్రి జిమ్మీ చేతిని తన భుజం చుట్టూ వేసుకుని, కారులోంచి దిగి తమ ఇంటి మెట్లు ఎక్కడానికి సహాయం చేస్తూ కనిపించాడు. తండ్రి కాళ్ళు నిలబడలేక సగం వంగడాన్ని కీత్ గుర్తించాడు.

కీత్ మొదటి మెట్టు దగ్గరికి వెళ్ళి నిలబడి వినసాగాడు.

“నేను సిగరెట్స్ కొనడానికి వెళ్ళాను. జిమ్మీ కౌంటర్ మీద తలవాల్చి కనిపించాడు. అతన్నించి వచ్చిన వాసనని బట్టి బాగా తాగాడని తెలిసింది. డే క్లర్క్ టెల్ ఫోర్డ్బుక్‌కి ఫోన్ చేసి, అతను వచ్చాక జిమ్మీని నా వెంట తెచ్చాను.” పోలీస్ ఆఫీసర్ చెప్పాడు.

"థాంక్యూ సార్జెంట్ లోజీ" తన తల్లి కంఠం వినిపించింది.

"అతనికి జిమ్మీకి ఒంట్లో బాలేదని చెప్పాను. మీ భర్త గురించి నిజం తెలుసుకోవాల్సిన అవసరం ఎవరికీ లేదు డెనిస్" సార్జంట్ చెప్పాడు.

కీత్‌కి తండ్రి నించి గురక శబ్దం వినిపిస్తోంది. సార్జెంట్  వెళ్ళిపోగానే డెనిస్ తన భర్తని అడిగింది.

"బ్లాక్ కాఫీ తాగుతావా? మెట్లు ఎక్కగలవా?"

ఆయన మాట్లాడకుండా నోటితో చేసిన శబ్దాలు వినిపించాయి.

"ఎందుకిలా తాగుతావు జిమ్మీ? నీ ఆరోగ్యం ఏం కాను?" తల్లి కంఠం, వెంటనే చెళ్ళున చెంపదెబ్బ చప్పుడు కీత్‌కి వినిపించాయి. తర్వాత తండ్రి మాటలు వినిపించాయి.

"ఇది నా ఆయుర్దాయ రేఖ. ఇది చాలా పొడుగ్గా ఉంది. తాగడానికి ఇంట్లో ఏం లేదా?"

తర్వాత వంట గదిలో షెల్ఫుల తలుపుల చప్పుడు.

మర్నాడు ఉదయం డెనిస్ కొడుకుని నిద్రలేపింది.

"స్కూల్‌కి ఇంకా టైం కాలేదుగా? ఎంతైంది టైం?" కీత్ నిద్రమత్తులో కళ్ళు తెరవకుండా ఆవలిస్తూ అడిగాడు.

"అయిదుంపావు. మనం వెళ్ళాలి."

"ఎక్కడికి?"

"మాంట్రియల్‌కి. నా చెల్లెలికి బాలేదుట. అందుకని త్వరగా పళ్ళు తోముకో. ఈలోగా బ్రేక్ ఫాస్ట్ రెడీ చేస్తాను" వాడి భుజాలు పట్టి లేపి కూర్చోపెట్టింది.

రెస్టారెంట్స్‌లో తినగలిగేంత డబ్బు తమకి లేదని కీత్‌కి తెలుసు. కీత్ కార్న్ ఫ్లేక్స్ తిన్నాక, డెనిస్ బరువుగా ఉన్న రెండు సూట్‌కేసులని కష్టం మీద మెట్ల మీద మోసుకొచ్చింది.

"పద. మనం బస్సుని మిస్ కాకూడదు" ఆమె కంఠంలోని తొందరని కీత్ గుర్తించాడు.

"నాన్నేరి? మనతో రావటంలేదా?" అడిగాడు.

"ఊహూ. నిద్రపోతున్నారు."

వారు టేక్సీలో బస్టాండ్‌కి చేరుకున్నారు. బస్సు సమయానికి వచ్చింది. ముదురు ఆకుపచ్చరంగు బస్సుని చూసి అడిగాడు.

"దీని రంగు ఇలా ఉందేమిటమ్మా?"

"ఇది కెనడా కంపెనీ బస్సు. నువ్వు ఇంతదాకా అమెరికన్ బస్సులనే చూసావు."

దాన్ని ఎక్కబోయే ముందు డెనిస్ బాత్రూములోకి వెళ్ళివచ్చి కీత్‌ని కూడా పంపింది.

"అమ్మా. నాన్న నిద్రలేచాక భోజనం ఎలా?" కీత్ దారిలో అడిగాడు.

తన తండ్రికి వంట రాదని, భోజనానికి తల్లి మీదే ఆధారపడతడని వాడికి తెలుసు.

"డైనింగ్ టేబుల్ మీద సిద్ధంగా ఉంచాను. వేడి చేసుకుని తింటారు."

పగలంతా ప్రయాణించి రాత్రి చీకటి పడుతుండగా బస్సు బే టౌన్ నుంచి మాంట్రియల్‌కి చేరుకుంది.

బస్సు మధ్యలో మూడు చోట్ల ఆగింది. మూడు చోట్లా తల్లీ కొడుకులు ఇద్దరు బాత్రూముకి వెళ్ళారు.

కీత్ రెండు చోట్ల ఆరంజ్ జ్యూస్ తాగాడు. ఇంటినించి తల్లి తెచ్చిన చీజ్ సాండ్ విచ్‌లని తిన్నాడు.

మాంట్రియల్‌లోని ప్రతి వీధి, బే టౌన్ లోని డౌన్ టౌన్‌లో వీధిలా కీత్‌కి కనిపించింది. అన్ని షాప్స్, రెస్టారెంట్స్‌ని వాడు ఎన్నడూ చూడలేదు. ఎలక్ట్రిక్ ట్రామ్స్ ని ఆశ్చర్యంగా చూశాడు.

బస్సు దిగాక డెనిస్ రెండు పెట్టెల దగ్గర కీత్‌ని కూర్చోబెట్టి చెప్పింది.

"నేను నా చెల్లెలికి ఫోన్ చేసి వస్తాను. ఇక్కడే ఉండు."

గాజు గోడలోంచి తల్లి చిల్లరని వేసి పబ్లిక్ బూత్‌లో రిసీవర్ ఎత్తడం చూసాడు.

రెండు నిమిషాల సంభాషణలో తల్లి మొహంలోని దుఃఖాన్ని చూసాడు. రిసీవర్ పెట్టేసి వచ్చి డెనిస్ చెప్పింది.

"నా చెల్లెలికి బావుందిట. ఆఫీస్‌కి వెళ్ళిందిట. మనకి గదిలేదు. ఓ ఫ్రెండ్ అందులో ఉంటుందిట. మనం అద్దెకి గదిని వెటాడాలి."

ఆమె దినపత్రికని కొని, క్లాసిఫైడ్ సెక్షన్‌లో ఫర్‌రెంట్ కాలమ్ ని చూసి కొన్ని నెంబర్స్‌కి ఫోన్ చేసి మాట్లాడింది.

కీత్ ఆ బస్టాండ్‌లోని బస్సులను లెక్కపెట్టాడు. పాతిక పైనే ఉన్నాయి. అన్నిటిని ఒకేచోట వాడు ఎన్నడూ చూడలేదు.

చివరికి తల్లి వచ్చి చెప్పింది

"పద."

లింకన్ అవెన్యూలోని రంగు వేయకపోవడం వల్ల ఇటుకలు కనిపించే ఓ బిల్డింగ్ ముందు వారి టేక్సీ ఆగింది. ఆమె వెంట కీత్ బరువైన సూట్ కేసులని మోసుకుంటూ వెళ్తుంటే చెప్పింది.

"సారీ కీత్. డ్రైవర్ లోపలికి తెస్తే టిప్ ఇవ్వాలి."

"ఫర్వాలేదమ్మా. మన దగ్గర ఎక్కువ డబ్బు లేదని నాకు తెలుసు" కీత్ బాధ్యతగా చెప్పాడు.

లేండ్ లేడీతో తల్లి మాట్లాడిన భాష వాడికి అర్థం కాలేదు. ఆవిడ వాళ్ళని ఓ చిన్న గదిలోకి తీసుకెళ్ళి చూపించింది. ఓ వైపు వంటకి చిన్న ప్లాట్‌ఫాం, స్టవ్ కనిపించాయి. డెనిస్ ఇచ్చిన అమెరికన్ డాలర్ల వంక చూసి ఆవిడ తల అడ్డంగా ఊపింది. డెనిస్ కొడుకుని తీసుకుని సమీపంలోని బేంక్‌కి వెళ్తుంటే వాడు అడిగాడు.

"నువ్వు మాట్లాడే భాష ఏమిటమ్మా?"

"ఫ్రెంచ్. ఇక్కడ ఎవరూ ఇంగ్లీష్ మాట్లాడరు. ఫ్రెంచే. నీకు అది త్వరలో వస్తుంది."

డెనిస్ అమెరికన్ డాలర్లని కెనడియన్ డాలర్స్‌గా మార్చింది.

ఆ రాత్రి డెనిస్ ఉన్న ఒక్క మంచం మీద పడుకుంటే, కీత్ ఫోల్డింగ్ సోఫాలో పడుకున్నాడు.

"సారీ, నీకు ఇంకో మంచం కొనేదాకా దాని మీదే పడుకోవాలి" మర్నాడు డెనిస్ చెప్పింది.

"కొనకమ్మా. నాకు సోఫా మీద బాగా నిద్రపట్టింది" వాడు బాధ్యతగా చెప్పాడు.

"మన ఇంటిని మిస్ అవుతున్నావా?" బాధగా అడిగింది.

"లేదు. నాన్నని కూడా."

"మనం తిరిగి మన ఇంటికి వెళ్ళటం లేదు. ఇక్కడే ఉంటాం."

ఇంట్లో తినడానికి ఏం లేదు కాబట్టి వాళ్ళు సూపర్ బజార్‌కి వెళ్ళారు. కావలసినవి కొన్నాక యిద్దరూ తిరిగి ఇంటికి వెళ్ళేప్పుడు డెనిస్ చెప్పింది.

"నేను మీ నాన్న పోట్లాడుకున్నాం."

"నేను విన్నాను."

"మేము ఇంక కలిసి ఉండకపోతే మంచిదని నిర్ణయించుకున్నాం. కాబట్టి నాన్న ఇక్కడికి రారు. మాంట్రియల్ బే టౌన్ కన్నా మంచి ఊరు. నువ్వు చలికాలంలో మంచులో హాకీ ఆడొచ్చు."

"ఓ! సంతోషం."

బే టౌన్ స్కూల్లో కీత్‌కి హాకీ ఆటలో కొన్ని మెడల్స్ వచ్చాయి. తన బబుల్ గమ్మ్ కార్డ్స్‌ని తన గది డ్రాయర్ సొరుగులో వదిలి వచ్చాడు. తను మళ్ళీ ఆ ఇంటికి తిరిగి వెళ్ళడని అప్పుడు తెలియదు. మళ్ళీ వాటిని సేకరించాలి అనుకున్నాడు.

"ఇంకోటి నేను దేశం మారి మాంట్రియల్‌లో ఉద్యోగం చేయబోతున్నాను కాబట్టి నా అసలు పేరు డెస్రో సియర్స్‌నే వాడతాను. ఎవరైనా డెనిస్ హార్బర్ గురించి అడిగితే తెలీదని చెప్పు. డెస్రో సియర్స్ అని అడిగితే మా అమ్మ అని చెప్పాలి. నీ స్కూల్ రికార్డ్స్‌లో అదే నా పేరు."

"అలాగే. నాన్న పేరు ఎవరికీ చెప్పను" కీత్ హామీ ఇచ్చాడు.

ఆమె ఆ సూపర్ బజార్‌లోని సూపర్ వైజర్ అనే బోర్డ్ ఉన్న తలుపు తెరుచుకుని వెళ్ళేముందు కీత్‌తో చెప్పింది.

"నువ్వు ఇక్కడే ఉండు."

"గాజు తలుపులోంచి తన తల్లి ఆ యాభై ఏళ్ళ వ్యక్తితో చేతులు కలిపి ఏదో సీరియస్‌గా మాట్లాడుతుంటే ఆయన మౌనంగా వినటం చూసాడు. తను ఆ గదిలోకి వెళ్ళినా తల్లి చెప్పేది తనకి అర్థంకాదు అనుకున్నాడు. చివరికి ఆయన తల ఊపి ఓ కాగితాన్ని తీసి ఇచ్చి నవ్వుతూ ఆమెతో ఏదో చెప్పి కరచాలనం చేసాడు.

బయటికి వచ్చిన తల్లి మొహంలోని ఆనందాన్ని చూసాడు. ఆమె చిరునవ్వుతో చెప్పింది.

"కీత్. నాకు ఇక్కడ ఉద్యోగం వచ్చింది. సేల్స్ గర్ల్, అకౌంటెంట్, కేషియర్."

ఆమె అప్లికేషన్ నింపి ఇచ్చింది.

ఆ పెద్ద సూపర్ బజార్‌లోని అనేక వస్తువులని చూసాడు. బే టౌన్‌లోని షాప్‌కి అది కనీసం వంద రెట్లు ఉంటుంది అనుకున్నాడు.

మర్నాడు రాత్రి ఓ శబ్దానికి మెలుకువ వచ్చి తల్లిని అడిగాడు.

"ఏమిటమ్మా అది?"

"అది అంబులెన్స్. ఈ పెద్ద ఊళ్ళో లక్షల మంది నివసిస్తున్నారు. ఎవరినైనా వెంటనే హాస్పిటల్లో చేర్పించాల్సి వస్తే ఫోన్ రాగానే అవి వెళ్తాయి. వాటి దారికి ఎవరూ అడ్డు రాకూడదు" డెనిస్ వివరించింది.

"అందుకు ఎంత డబ్బు కట్టాలి?"

"ఫ్రీ. ప్రభుత్వమే ఆ ఖర్చుని భరిస్తుంది."

"ఐతే అమెరికా కన్నా మంచి దేశంలోనే పుట్టావు" కీత్ చెప్పాడు.

వీకెండ్‌కి డెనిస్ వాడిని పెద్ద పార్కుకి తీసుకెళ్ళింది. విశాలమైన ఆకుపచ్చ లాన్స్, ఎత్తయిన చెట్లు, అనేక ఫౌంటెన్స్, చెరువులో బాతులు. కీత్‌కి అది బాగా నచ్చింది.

"ప్రతి వీకెండ్‌కి ఇక్కడికి వద్దామా అమ్మా? టికెట్ లేదు" అడిగాడు.

"నువ్వు చాలా బాధ్యతగా అన్నీ అర్థం చేసుకుంటావు కీత్" డెనిస్ వాడి జుట్టు నిమురుతూ చెప్పింది.

"నువ్వు ఎక్కడా ఇక మీ నాన్న గురించి మాట్లాడకు. నాతో కానీ ఎవరితో కానీ."

"అసలు బే టౌన్ గురించే మాట్లాడనమ్మా."

కీత్‌కి కూడా తన తండ్రికి దూరంగా ఉండటం నచ్చింది. ఆయన తిట్టే తిట్లని ఇక తలవంచుకుని వినక్కర్లేదు. తల్లిని కొట్టే చప్పుళ్లని కూడా.

"ఇక్కడ లైబ్రరీ మన  లైబ్రరీ కన్నా బాగుంది" ఓ రోజు తల్లితో చెప్పాడు.

బే టౌన్ అనే పదాన్ని వాడూ మాట్లాడటం లేదని డెనిస్ గుర్తించింది.

త్వరలోనే వాళ్ళిద్దరూ మాంట్రియల్ మొత్తం తిరిగి చూసారు. పార్కులు, మ్యూజియాలు, మాల్స్, పిక్నిక్ స్పాట్స్. మాల్ వాడికి అన్నిటికన్నా బాగా నచ్చింది. అక్కడ పిల్లలు ఆడుకోవడానికి ఉన్నవి వాడటానికి టికెట్ లేదు.

రెండు వారాలు గడిచాక వాళ్ళిద్దరూ ఇంట్లో బ్రేక్‌ఫాస్ట్ తింటూ ఉండగా డోర్ బెల్ మోగింది.

కీత్ వెళ్ళి తలుపు తెరిచాడు.

ఎదురుగా బే టౌన్ పోలీస్ సార్జంట్ లోజీ. అతన్ని చూసి డెనిస్ ఆశ్చర్యపోయింది.

"రండి సార్జెంట్. బ్రేక్‌ఫాస్ట్ తింటారా?" ఆమె చిరునవ్వుతో ఆహ్వానించింది.

అతను వచ్చి బల్ల ముందు కూర్చుని చుట్టూ చూసాడు. అది ఒకటే గది అని గ్రహించాడు.

"కీత్. ఒకసారి బయటకి వెళ్తావా?" డిగాడు.

"ఫర్వాలేదు. వాడు పెద్దవాడు. ఉండనీయండి. ఏదో విశేషం లేకుండా మీరు ఇంత దూరం రారు. ఏమిటది? లేక మాంట్రియల్‌కి వేరే పని మీద వచ్చి మమ్మల్ని చూడాలని ఇక్కడికి వచ్చారా?" డెనిస్ అడిగింది.

"లేదు. అధికారికంగా నీతో మాట్లాడాలనే వచ్చాను."

"అధికారింగానా?"

"అవును. ముందుగా నీకో అశుభవార్త. జిమ్మీ పోయాడు."

"అయ్యో! ఎలా జరిగింది?" డెనిస్ ముందుకి వంగి వెంటనే ప్రశ్నించింది.

"నువ్వు చెప్తావని ఆశతో వచ్చాను డెనిస్."

"నేనేం చెప్పగలను? నాకెలా తెలుసు?"

"నువ్వు అకస్మాత్తుగాబే టౌన్‌ని వదిలి వెళ్ళిపోయావు. ఎవరికీ చెప్పకుండా. మీ పొరుగింటి ఆవిడ రెండు రోజులుగా ఎవరూ మీ ఇంటి బయట పాలసీసాలని తీసుకోకపోవడం చూసి మాకు ఫోన్ చేసింది. మీ కుటుంబంలోని ఎవరినీ కొద్ది రోజులుగా చూడలేదని చుట్టుపక్కల వాళ్ళు చెప్పారు. మేము ఇంటి తలుపు తాళాన్ని బద్దలు కొట్టాల్సి వచ్చింది."

అతను ఆగి చెప్పొచ్చా, చెప్పకూడదా అన్నట్లుగా కీత్ వంక చూసాడు.

"చెప్పండి."

"పడకగదిలో మేము శవాన్ని చూసాం. జిమ్మీ తలమీద కొన్నిసార్లు బలంగా మోది చంపారు. ఆ సుత్తిని సింక్‌లో కడిగి పెట్టారు."

"నా చెల్లెలికి ఒంట్లో బాలేదని ఫోన్ చేస్తే ఉన్న పళాన నేను ఇక్కడికి రావాల్సి వచ్చింది."

"నీ చెల్లెలు ఏది?"

"దానికి బాగయ్యాక మేము ఈ గది అద్దెకి తీసుకున్నాం. జిమ్మీతో విసిగిపోయిన నాకు బే టౌన్ కన్నా ఇక్కడే హాయిగా ఉంది. నన్ను ఎలా కనుక్కున్నారు?"

"మీతో పాటు బే టౌన్‌లో బస్ ఎక్కిన ఒకరు ఆ సంగతి చెప్పారు. లేదా నేను నిన్ను కనుక్కునేవాడిని కాదు. ఇక్కడి అన్ ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో కొత్తగా ఉద్యోగాలు సంపాదించినవారి వివరాలు ఉన్నాయి. అక్కడ నీ అప్లికేషన్ జిరాక్స్ ద్వారా ఈ చిరునామా తెలిసింది.. ఎందుకు నీకు అంత కోపం వచ్చింది?" సార్జంట్ కొద్దిసేపు ఆగి ప్రశ్నించాడు.

"నాకు మా వారి హత్యతో ఏం సంబంధం లేదు."

"అతను మరణించిన సమయంలోనే నువ్వు నీ కొడుకుతో మాయమయ్యావు. అంతా నువ్వే ఆ పని చేసావని అనుకుంటున్నారు. "

"అనుకోనివ్వండి."

"కానీ చట్ట ప్రకారం నీనించి వివరణ కావాలి."

కీత్‌కి అది షాకింగ్‌గా ఉంది. తండ్రి మరణించడం కన్నా తమని బే టౌన్ తీసుకెళ్ళడం, తను మాంట్రియల్ జీవితాన్ని మిస్ అవుతాడు. తనకి అక్కడ మాల్స్, ఆట స్థలాలు, పార్కులు ఉండవు.

"ఆయన్ని నేను చంపలేదనే స్టేట్మెంట్ చాలదా?"

"చాలదు. కోర్టు, జూరీ సభ్యులు దాన్ని ఆమోదించాలి. ఒకవేళ నీకు శిక్షపడితే మీ అబ్బాయిని నీ చెల్లెలు సంరక్షకురాలిగా చూసుకుంటుందా?"

"లేదు. దాన్ని ప్రేమించిన జిమ్మీ నన్ను చేసుకున్నందుకు దానికి నా మీద ఆగ్రహంగా ఉంది. ఈ ప్రేమ గురించి ముందే తెలిస్తే నేను జిమ్మీని చేసుకునేదాన్ని కాదు."

"జిమ్మీకి శత్రువులు ఉన్నారా? ఆయన్ని ఎవరు చంపి ఉండచ్చో చెప్పగలవా?" సార్జెంట్ ప్రశ్నించాడు.

"మా నాన్నని ఎవరు చంపారో నాకు తెలుసు" కీత్ చెప్పాడు.

ఇద్దరూ వాడి వంక ఆశ్చర్యంగా చూశారు. మొదటిసారి డెనిస్ మొహంలో స్వల్పంగా భయం కనిపించింది.

"ఎవరు?"సార్జెంట్ ప్రశ్నించాడు.

"కీత్" ఆమె వారిస్తూ చెప్పింది.

"చెప్పు కీత్.ఎవరు?"

"బ్రూనో చంపాడు."

"బ్రూనో? అతనెవరు?"

"నాకు తెలీదు. మా నాన్న అతన్ని బ్రూనో అని పిలిచాడు. నువ్వు అతన్ని ఎప్పుడూ చూడలేదమ్మా. నువ్వు లేనప్పుడు ఓసారి బ్రూనో మన ఇంటికి వచ్చి నాన్నతో కలిసి చాలా తాగాడు. అతను నావికుడు. తను ఓడలోంచి వచ్చానని చెప్పాడు. నువ్వు వస్తూంటే అతను వెనక తలుపులోంచి వెళ్ళిపోయాడు. వెళ్ళేముందు 'ఆ డబ్బు సెటిల్ చెయ్. లేదా నువ్వు ఉండవు' అని బెదిరించి వెళ్ళాడు."

"అతను ఎలా ఉన్నాడు?" సార్జెంట్ ప్రశ్నించాడు.

“చూడలేదు. పైన మొదటి మెట్టు మీద నుంచుని విన్నాను.”

“నేను బ్రూనో గురించి ఎన్నడూ వినలేదు” సార్జెంట్ ఆలోచనగా చెప్పాడు.

"నేను కూడా. కాని మా అబ్బాయి చెప్పాడంటే అది నిజంగా జరిగి ఉంటుంది" డెనిస్ చెప్పింది.

"మేం బయలుదేరే ముందు నేను మా నాన్న దగ్గరికి వెళ్ళి గుడ్ బై చెప్పాను. తను త్వరలో ఈ ఊరు వస్తానని, ఇక ఇక్కడే ఉందామని చెప్పారు. నేను వచ్చేదాకా అమ్మని బాగా చూసుకో అని కూడా చెప్పారు."

సార్జెంట్ గంట తర్వాత కాఫీని పూర్తి చేసి చెప్పాడు.

"థాంక్స్. నేను చాలా దూరం డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళాలి. కాబట్టి కాఫీ ఇచ్చి మంచి పని చేశావు. మీ అబ్బాయి, నువ్వూ సంతకం చేసిన స్టేట్మెంట్లతో కేసు ఫైల్ని మూసేస్తాను. గుర్తు తెలియని వ్యక్తి లేదా వ్యక్తులు జిమ్మీని చంపారు అనే వివరణతో ఆ బ్రూనో ఎవరో తెలుసుకునే ప్రయత్నం చేస్తాను. అవసరమైతే మరోసారి ప్రశ్నించడానికి వస్తాను. ఇదే అడ్రస్‌లో ఉంటారుగా?"

"ఇక్కడే ఉంటాను. ఇది నా ఉద్యోగానికి దగ్గర. చవక. కీత్‌కి కూడా మాంట్రియల్ నచ్చింది. ఇక్కడి నించి కదలం" డెనిస్ చెప్పింది.

"మేం మాంట్రియల్లోనే ఉంటాం" కీత్ కూడా చెప్పాడు.

"బే టౌన్ మిమ్మల్ని నష్టపోయింది" చెప్పి సార్జెంట్ లేచాడు.

అతను పోలీస్ కారెక్కి వీడ్కోలు చెప్పి దూరంగా వెళ్ళేదాకా ఇద్దరూ గుమ్మం దగ్గర నిల్చుని చూశారు. తర్వాత డెనిస్ బ్రేక్‌ఫాస్ట్ గిన్నెలని సింక్ దగ్గరకు తీసుకెళ్ళి తోమడంలో కీత్ కూడా సహాయం చేశాడు.

"నువ్వు చాలా బాధ్యతగా ప్రవర్తిస్తావు" డెనిస్ చెప్పింది.

మాంట్రియల్ టైమ్స్ అనే దినపత్రిక స్పోర్ట్స్ కాలంలోని హెడ్డింగ్‌ని డెనిస్ కానీ, సార్జెంట్ కానీ చూడలేదు. హాకీ టీం లీడర్ ఐన ఆటగాడి గురించి రాసిన వార్తకి హెడ్డింగ్.

బ్రూనో చంపేశాడు.

**(వచ్చేనెల మరో కథ)**

COMMENTS